శశికళ

అడివి బాపిరాజు

శశికళ

★

(పాటల సంపుటి)

కులపతి
అడివి బాపిరాజు

శశికళా ప్రచురణలు
బ్రాడీపేట
రామచంద్రపురం
తూర్పుగోదావరి.

ఈ గ్రంథముపై
సర్వహక్కులూ
ప్రకాశకులవి

వెల
ఒక రూపాయి

ప్రెస్
మురళీకృష్ణ
రామచంద్రపురం.

-: ప్రస్తావన :-

శశికళాప్రియుడు,కవి, చిత్రకారుడు, సంగీత నాట్య కళాకోవిదుడు అగు కులపతి శ్రీ అడివి బాపిరాజుగారి శశికళ గేయకావ్యమును తొలిసారిగా ప్రచురించి ఆంధ్ర సారస్వతాభిమానులకు సమర్పించగలిగినందుకు ఎంతయో సంతసిస్తున్నాను.

ఇందలి గేయములు చాలావరకూ మద్రాస్, విజయవాడ, హైద్రాబాద్ రేడియోకేంద్రముల నుండి ప్రసారితము లవుతున్నవే. 'పాడకే నా రాణి' 'బాలవే నీవెపుడు' పాటలు రెండూ ప్రసిద్ధగాయకులు శ్రీ ఎమ్.ఎస్ రామారావుగారు హెచ్. ఎమ్. వి. గ్రామఫోన్ రికార్డులలో పాడియున్నారు. ఇందులో కొన్నికొత్త గేయములు కూడా చేర్చి పుస్తకమంతా సరిచూసుకున్నారు తమ జీవితపు చివరిదశలో బాపిరాజుగారు.

బాపిరాజుగారు రచించిన గేయములు, చిత్రములు అనేకం ఉన్నాయి. ఆయన ఒకచేతితో కలం మరొకచేతితో కుంచె పట్టుకుని సమంగా ఒకదానికొకటి అండగా రైలుపట్టాలవలె నడిపించారు. 'మన చెలిమి' అనే గేయంలో.

'ఎవరు నేనీ జగతి
ఎవరు నేనీ ప్రగతి'

అని బాపిరాజుగారు జీవితాంతమున ఆత్మపరిశోధన చేసుకున్నార.

శశికళ అనేకరూపాల్లో- సూర్యసుతగా, యోగినిగా, నర్తకిగా, గానసుందరిగా, దేశికగా, ప్రేయిగా, ఆయనకు దర్శనమిస్తుంది.

బాపిరాజుగారి జీవితమంతా కళామయంచేసి చివరికి ఆయననుతనలో లీనంచేసుకున్నది శశికళ.

బాపిరాజుగారు అదృశ్యులైనా ఆయన గ్రంధావళి దీపావళివలె ఎప్పుడూ జ్వలిస్తూనే ఉంటుంది.

శశికళా నిలయం
రామచంద్రపురం
రావులపర్తి భద్రిరాజు.

1 జనవరి 1954

విషయ సూచిక

తెర
అమరత్వము
నిరీక్షణ
అనర్హత
అనర్ఘము
ఎవరవే !
ఈనిశిని
ఎవరికోసం
ఎవరివో ఆ కలస్వనాలు
నువ్వటే
పువ్వటే
ప్రత్యక్షము
లోకము
సూర్యసుత
అవతరణము
అతిధి
నువ్వు
చరిత్ర
నీలము
శశికళ
నగ్న
ఆవెనుక
పరమార్ధము
ఉగాది
ప్రస్థానము
శ్రుతిలేని
మార్పు
ఒకరికొకరు
ఆట పాటలు
ప్రణయకోపన
రాగిణీమాల
మేలుకొలుపు
యోగిని
సంగీత మేలనే
నాట్యము

అక్కసురాలు
త్రప
ఆశయదేవి
పూజ
కంటినవ్వు
అటు ఇటు
ఇంద్రజాలిక
విప్రలంభ
ఒఖ్ఖణ్ణి
సంప్రార్ధన
నారాణి
గంగాధర
కళా పరిమళము
నిత్య యౌవన
అనుగమము
కారణము
మార్గము
ఇష్ట దేవత
ధ్యేయము
పిలుపులు
నర్తకి
వర ప్రదానము
పూల బాలిక
యుగ్మము
ఎండిమియాన్
మన చెలిమి
సొగసు ... వయసు
వసంత పూర్ణిమ
స్మృతులు
దేశిక
ఇంతలో...
గ్రీవ గంగోత్తరి
ఖేచరి
జ్యోత్స్నా ద్యుతి
గానసుందరి
గౌరీశంకర శృంగావిర్భవ
దీపావళి

అంకితము

నా ఆశయమూర్తి
నా ఆత్మపూజా పీఠస్థ
శిల్ప కళా లక్ష్మి
శశికళకే..

-బాపిరాజు

ఏడాది బాపిరాజు

(ఊహాచిత్రం)

చిత్రకారుడు:-అడివి బాపిరాజు.

శ్రీరస్తు
శ్రీ పరదేవతాయై నమః

తెర

ధవళమైనదీ తలపు దాటినది
దానికి మొదలూ చివరా లేనిది
నీకు ఇవతల
నాకు అవతల
తెర ఉన్నాది బాలా!
తెర ఉన్నదే!
తెర మీదానిన నీడను జూస్తిని
తెరచాటున నీ పాటలు వింటిని
తెరచొచ్చిన నీ కాంతిని జోగితి
తెరువేమన్నా
తెలియలేకనె
కలిగిపోతినీ
తెర ఉన్నాది బాలా!
తెర ఉన్నదే!
కన్నులు కానని రూపం పిలిచీ
కౌగిలికందని భావం తలచీ
తెరవైపున నా చేతులు మోడ్చీ
అరమూతలు నా తీరని కలవై
చీల్చిన చిరగని తెర ఇవతలనే
చేరగరానీ నీవవతలనే
తెర ఉన్నాది బాలా!
తెర ఉన్నదే!

అమరత్వము

✽

ఓ చెలీ!
ఓ చెలీ!
నీవు నా నిదురలో మూర్తించి
నీవు నా ఎదలలో నర్తించి
పూవులో తేనెవై
తావిలో మత్తువై
పాటలో ఫణితివై
మాటలో తేటవై
అమృత బిందువులోని
అమరత్వమైతివే!
ఓ చెలీ!
ఓ చెలీ!

✽

నిరీక్షణ

నీకై నే ఎదురుచూస్తి
నీకై నే వెదకినాను
    కను తెరచిన కలలమధ్య
    కలలెరుగని గాఢనిద్ర!
    నీకై నే ఎదురు చూస్తి
    నీకై నే వెదకినాను
నను తెలిసే శిశుదినాల
వినితెలిసే బాల్యలీల
    యౌవన మధు మధురాలలో
    భావా భావ స్థితిలో
    నీకై నే ఎదురు చూస్తి
    నీకై నే వెదకినాను
ఎవరవో నీ వెటులుందువో
ఎవరవో నీ వెట నుందువో
    భువిజవో దివిజాంగనవో
    అవతరించినావో ఏమో
    నీకై నే ఎదురు చూస్తి
    నీకై నే వెదకినాను

అనర్ఘత

వెదకలేనే రాణి నిన్నూ
వేదనా పూర్ణ మీ బ్రతుకులోనూ!
వెదకలేనే రాణి నిన్నూ!

వదలలేనే కలలు
నిదరలేదే మనసు
  చెదిరె హృదయము శాంతి
  కుదురుకొనెనే క్లాంతి
  వెదకలేనే రాణి నిన్నూ!

కదిలించి బ్రతుకంత
విదిలించి బంధనలు

  చదల కెగయగ దేవి
  దెసలంటు రెక్కలేవి
  వెదకలేనే రాణి నిన్నూ
  వేదనా పూర్ణమీ బ్రతుకు లోనూ!

అనర్ఘము

✿

నిన్ను దరిసినకాంతి
నిన్ను పొందిన కాంతి
వెన్నెలలు వెలిగెనే
విరిసె మల్లెలు కోటి

నీవు వెలిగే కాంతి
నిన్ను వీడే కాంతి
మిన్ను టేరే బాల
స్విన్నామృతమె లీల

నిన్ను చుట్టి ఒకకాంతి
నీలోన ఒకకాంతి
ఉజ్వలమ్మై స్తిత
ప్రజ్వలమ్మై తప్త
కాంచనమ్మై వెలిగె

నీవు నెలరేకవట్టె
నీవు వెన్నెల వటే
పరమ శోభవు నీవు
నిరతిశయ ప్రణయవే !

✿

ఎవరవే !

ఓ చెలీ నీవెవరు
ఓ చెలీ నీవెవరు

కలలోని పాపవా ?
కతలోని బాలవా ?

మధుర మందానిల. పరీమళమవో
మధుమత్త శారాదాత్మిక సుషమవో !

సుందరాప్సరసాంగనా కంఠ
తుందిలము మందార మాలవో !

ఓ చెలీ నీవెవరు ?
ఓ చెలీ నీవెవరు ?

కలలోని ముగ్ధవా ?
కతలోని స్నిగ్ధవా ?

వారాసిలో పొంగు కెరటాలవో
నీరాల లోతులో నీలాలవో

తుంగ వీచీ శిఖర
భంగ రేఖా రచిత
శుక్తి గర్భాంతరిత
ముక్తా ఫలాచ్ఛవో !

ఓ చెలీ నీవెవరు
ఓ చెలీ నీవెవరు !

కలలోని పొలతివా ?
కతలోని మెలతవా ?

ప్రత్యూష బాలాధరారుణిమవో
నిత్య నూతన భాను కిరణమ్మవో !

గాఢ రజనీ హృదీ
వ్యూఢ గంభీరస్థ
తమసులో నుదయించు
విమలభాః కణమవో ?

ఓ చెలీ నీవెవరు ?

ఓ చెలీ నీవెవరు ?

కలలోని సుందరివొ ?
కతలోని చందిరవొ ?

కాదంబినీ వక్ష నట శంపవో
ప్రాదంబరేంద్ర కార్ముక వర్ణవో ?

అరుణాంశు చుంబితా
నందరాజీవ హృదయ
కేసరపరాగ గాం
గేయ ప్రకాశవో !

ఓ చెలీ నీవెవరు
ఓ చెలీ నీవెవరు ?

కలలో నణీయవా ?
కతలోని ప్రణయవా ?

దివిజ గంగా తరంగ స్వరమవో
హిమజ యమునా గమన గానమ్మవో!

గోదావరీ సప్త
కూలం కషానుగత
తాపస పవిత్రపద
తాళ స్వరూపవో !

ఓ చెలీ నీవెవరు
ఓ చెలీ నీవెవరు ?

కలలోని భావవో ?
కతలోని దేవివో ?

గగన లలనా శిరో రత్నమ్మువో
కలశపాధోరాసి సారసనవో ?

తాండవేశ్వర నాట్య
తాళ తకిట ధ్ధిమిత
ఝంతర ఝణ క్వణిత్
స్వర్ణ మంజీరవో !

ఓ చెలీ నీవెవరు
ఓ చెలీ నీవెవరు

కలలోని మాయవో ?
కతలోని ధ్యేయవో ?

✽

ఈనిశిని

బ్రతుకంతా నిరీక్షణము
మతి అంతయు వీక్షణమై

ఈ నిశిలో గాటపుతమి
నేను వేచియుంటి నొంట

ఈనిశి ఒక సుముహూర్తము
గానము ఈ నిశ్చలతయె

ఈ కుటీర ప్రాంగణమున
చీకటి చెలిగా నిలచితి

ఈ నిశిలో రొదలు లేవు
ఈ నిశిలో సొదలు రావు

వేచియుంటి ఎవరికొరకొ
కాచియుంటి ఏ ఘటనకొ

ఈ నిశిలో నడికి రేయి
ఎవరో నాతోట తొచ్చి
పూ మొగ్గల విరియచేసి
ముంగిలో అడుగులిడిరి

తూరుపు మల నెలతోచెను
తొగ కన్నెలు వగలూరిరి.

ఎవరికోసం

ఎవరికోసం కంఠమున ప్ర
స్రవణమైనా గీత ముబుకును

ఎవరికోసం గీతికా ఝరి
ప్రవాహించును వడులు సుడులై

ఎవరికోసం వడుల సుడులలో
అవతరించును మధుర తాళో

ర్మికా కోటుల్ !
ఎవరికోసం ?
ఎవరికోసం ?

ఎవరివో ఆ కలస్వనాలు

ఎవరివో ఆ కలస్వనములు
ఎవరిదో ఆ మధురగీతము !

భువన మోహనరాగ మొక్కటి
పొంగిపొరలెను దెసలు మునిగెను

ఇటులచూచితి అటులచూచితి
ఎటుల కనినను ఎవరు లేరూ

తీపి బరువులగీతి మాత్రము
ఓపలేనీ నన్ను ముంచెను

శిల్ప ప్రతిమై చేష్టలుడిగితి
కల్పములు వే కంగినవి హృది

గానమది అతిలోకమై చవ
లానె పొల్కడలిలో అలలై

గాయనీ ఆబాల ఎవరో
ఏ అనంతములోన దాగెనో

ఎవరివో ఆ కలస్వనములు
ఎవరిదో ఆ మధురగీతము !!

నువ్వటే

✽

నువ్వటే నువ్వటే
పువ్వు విరిసిన వయసు
నవ్వు లలమిన సొగసు

రువ్వినా ఎదపైన
చివ్వు నంతర్హితవే
నువ్వటే నువ్వటే !

నువ్వటే నువ్వటే
కవ్వించి నాకాంక్ష
త్రవ్వించి నా కలలు

ఉవ్విళ్లుగొన మనసు
దవ్వైతి వే దెసల
నువ్వటే నువ్వటే !

నువ్వటే నువ్వటే
జవ్వనీ ప్రణయినీ
మువ్వంపు వగలాడి

అవ్వారు ముద్దియా
నవ్వుతూ నను వదలి

రివ్వు రివ్వున మిన్ను
పవ్వళింపైతివే
నువ్వటే నువ్వటే !

✽

పువ్వటే

పువ్వటే నీసొగసు
వేలుపుల
బువ్వటే నీనవ్వు
ఈ వెలుగు లేమంట
ఏను తడబడుటలే !

ఎటు చూచినా వెలుగు
ఎదురుకొన్నది నన్ను

కలవళము పడుతూనె
కనులు మూసితి నేను
పువ్వటే నీసొగసు
వేలుపల
బువ్వటే నీ నవ్వు

కనులు మూసితె నేమి
కాంతులావుట ఎట్లు
నాలోన నాపైన
నానార్థముల కాంతి
పువ్వటే నీ సొగసు
వేలుపుల
బువ్వటే నీ నవ్వు. !

ప్రత్యక్షము

ఒక రాగాలాపనలో
ఒక గీతా విష్కరణలొ

ఎవరో ఒక దివ్యరూప
ఎవరో ఒక తళుకుచాన
కిరణం లా కరణం లా
సురచాపం వర్ణం లా

మెరసిందహొ మిరిమిట్లై
దరిసిందహొ దరిసెనమై !

ఒక రేఖా విన్యాసము
ఒక వర్ణం ప్రసరింపులొ

ఎవరో ఒక దివ్య భావ
ఎవరో లావణ్య మూర్తి
అమ్నాయ సునాదంలా
అతివేల రసాపగలా
అసేచన కాలేఖ్యము
అతి రేఖావతరణమ్ము

నిరతిశ యానందమ్మై
పరిమళాంగి ప్రవిమలాంగి
పారిభద్ర ప్రసూనాంగి
విరసిం దహొ విదురేఖై
కురిసిం దహొ సురమధువై !

దివి తరించి భువి తరించి
అవతరించె నా ప్రణయిని
దిశామూర్తి శశి కళాఖ్య
నిశామూర్తి శశి కళాఖ్య
గోదావరి పాడిందీ
గోవత్సం ఆడిందీ
సాయంతన కల్యా బాల
చల్లెను పన్నీటి జాలు,
చల్లెను స్వర్ణాక్షతలను
చదల దేవి ఆశీస్సుల !

లోకము

చంద్ర లోకం తూర్పుదెసలో
సూర్యలోకం పశ్చిమంలో
    చిన్నిలోకం ఒకటీ ఉన్నాదే !
        ఓనా వెన్నెల చిన్నారి పడుచా !
            ఆ లోకమేలే
        కన్నెరాణివి నువ్వే నువ్వేనే !

వాడిపోవని పూల తోటలు
నీడ లెరుగని నిండు పున్నమ
    పరిమళాలే పిన్నవాయువులూ
        ఓనా వెన్నెల చిన్నారి పడుచా !
            ఆ జగతి వెలిగే
        వన్నె లాడివి నువ్వే నువ్వేనే !

నింగి నీలిమ కంటి బొమలూ
ముంగురులె మొయిల గములూ
తొంగలి రెప్పలె ఇరుల కారంచుల్
    ఓనా వెన్నెల చిన్నారి పడుచా !

        చెంగలించే చుక్కలె నీకన్నుల్
            నా పూజాపీఠం
        సింగారి వేల్పువు నువ్వే నువ్వేనే !

పొద్దు పొడుపూ తొగరు కెమ్మోవి
ముద్దు మోమేమొయిల తెరువూ
    నిద్దపుకౌనూ మిన్నుటేరేనే !
        ఓనా వెన్నెల చిన్నారి పడుచా !
        విద్దెలన్నీ నీవే నీవేనే
            నా హృదయ కమలం
        సుద్దు లాడివి సొబగు లాడివి
            నువ్వే నువ్వేనే !

కంటిలోనికి కలలు పొదిగీ
కంఠంలోనే తీపులు పిదిగీ
    జంట చేస్తివి చేతికి కౌశల్యం
    ఓనా వెన్నెలా చిన్నారి పడుచా !
        మంటి మింటికి శ్రుతిగా నాతలపూ !
            నా ఆత్మ మధ్యవు
        అమృతమూర్తివి నువ్వే నువ్వేనే !

సూర్యసుత

సూర్య సుతవే శశికళా
చంద్ర బాలవు శశికళా

కుసుమమాలల
కోమలాంగీ
మిసిమి వన్నెల
మించు బాలా !

సూర్యసుత వీవే
శశికళ
సోమ సుత వీవే !

అమృత విలసిత
విమల గాత్రీ
కొమరు ప్రాయవు
కొమ్మ ముద్దులగుమ్మ వీవే

సూర్య సుత వీవే
శశికళ
సోమ సుత వీవే !

నిత్య వికసిత
నృత్య మూర్తీ
ముత్యముల డాల్
మోహమూర్తీ

సూర్య సుత వీవే
శశికళ
సోమ సుత వీవే !

నీవటే నా
ప్రణయ నిధివీ
నీవటే నా
తపస్సిద్ధివి

సూర్య సుత వీవే
శశికళ
సోమ సుత వీవే !

అవతరణము

✽

నీలి మీను పవళింపు
నిదురించు నీ సొంపు

తేలిపోతూ దిగెను
వేల లే వెలిగేను.

తొంగలించే వయసు
నింగినం తా ఒలసె

బంగారు మంచాన
పవళించె నీ సొగసు.

తెలికొండపై గంగ
తేలి వాలిన రీతి

తెలివినా తలపుగిరి
తేలివాలితి నాతి

నిత్య వికసిత దేహ
నృత్య విలసిత హస !

నిదురించు నిను కోరి
పదము మొదలిడినాను.

జన్మ జన్మల రాణి
తన్మయుడనే జాణ

మేలుకొలుపులు నిన్ను
జాలిగా పిలిచె నటె.

అల నల్ల నాడించి
అరవిచ్చె నీ కనులు

దరిసినది నీ సొగసు
విరిసినది నా మనసు.

విరుచుకొను నీ మేను
వికసించు కల్పకము

ఆత్రమై ఆశతో
చిత్రమై దరినేను.

వాలు చూపుల చూచి
మేలుకొనె నీ వలపు

తొలిపొద్దు కిరణమై
చెంగలువ అరుణమై.

జాళువా పొన్పుదిగి
బాల వయ్యారమై

మ్రోల నిలిచితి వటే
మోకరిల్లితి నేను

ఎవ రెవరి హృదయాలు
ఏమి కాంతించెనో

ఎవ రెవరి భావాలు
ఏమి కాంక్షించెనో !

✽

అతిధి

రూపు రేఖల రుచి తళర్ధళ
చూపు సొ బగుల సురభిళమ్ములు

జల జలా వచ్చావు బాలా
పల పలా తోచావు బాలా !

స్వచ్ఛ శోభాపూర్ణ మూర్తివి
విచ్చు పాటల పుష్ప వదనపు

అలలు లా వచ్చావు బాలా
కలలు లా వచ్చావు బాలా !

ఘల్లు ఘల్లన కాలి మువ్వలు
ఝల్లుమన నా జన్మ మంతా

వెల్లువై వచ్చావు ప్రేయసీ !
వెన్నలై వచ్చావు ప్రేయసీ !

నువ్వు

పూవు లో మసృణములు
తావి లో ఘ సృణములు

ప్రోవు ప్రోవులు చేరి
నీవుగా మూర్తించె.

రాయంచ స్విన్నతలు
ప్రాలేయ స్వచ్ఛతలు

లీలార్ధ్రమై కలసి
బాల నీవై వెలసె.

కోకిలల కువ కువలు
వాక పరువుల కివలు

నీ కంఠమున సొలసి
నీకు పలుకులు పొలసె.

ఆకాశ నీలాన
రాకా సు ధాకరము

నీ కనులు వెలిగెనే
నా కమృతము కలిగె !

చరిత్ర

మర్త్యుడను నే నటే
    ప్రియ బాల
అమర సఖి వీవటే !
ఒక తారకా కాంతి
    ఒక దివ్య లిప్తలో
చీకట్ల వెలిగిస్తు
    చేరినది ఈ భువిని
        తార కిరణము నేను
        తారకవు నీ వటే !
శిల్ప నిష్ణాత గా
    చిత్రకారుణ్ణిగా
జన్మ జన్మా లెన్నొ
    తన్మయ కళా పూజ
        శిల్పి నేనే నటే !
        శిల్పమవు నీ వటే !
ఆనాట జంతాన
ఆంధ్రపురి కటకాన
    ఆంధ్ర కవి స్వప్నాన
    ఆంధ్ర నట కరణాన
    ఆంధ్ర సంస్కృతి నేనె
    ఆంధ్రత్వ మీ వటే !

నీలము

నీలి కలువ పుటాలలో
తేలిపోవు నీలి మలుపు
నీలరత్న హృదయంలో
సోలిపోవు కాంతి సూక్తి
నెమలి గళము వంపుల్లో
నృత్యమాడు నీలి నిగలు
నీలాకాశ రహశ్యము
కాళిందీ ఝరి నీరము

మూర్తించినవే కన్నులు
నర్తించెను కనుపాపలు
సూర్య సుతా శశి కళవే
ఆర్య సఖీ శశి కళవే !

శశికళ

దివ్య భాసిత రూప శశికళ
నవ్య సుందరమూర్తి శశికళ
నిత్య యౌవన స్నిగ్ధ శశికళ
ప్రత్యయిత నాదేవి శశికళయే !

చిత్ర రూపము రంగు శశికళ
శిల్పకౌశల్యమ్ము శశికళ
చిత్రకారుని కుంచె శశికళ
శిల్పి చేతులు ఉలియె శశికళయే !

కావ్య నాయిక నాకు శశికళ
కావ్య రసమున స్థాయి శశికళ
కావ్య వ్యంగ్యము రీతి శశికళ
కావ్యమే నాగీతి శశికళయే !

వీణ తీగల మెట్లు శశికళ
గాన మాధుర్యాలు శశికళ
రాగములు తాళాలు శశికళ
వేగమగు కీర్తనము శశికళయే!

నగ్న

✿

వెన్నెల లో వెలుగుధార
వన్నెల తో స్నానమాడ

ధవళకాంత తరళ మూర్తి
భువన సకల మోహ మూర్తి
ప్రణయ దేవి నా శశికళ
మృణాలాంగి నా శశికళ
పూర్ణ నగ్నయై నిలిచెను
చూర్ణ కుంతలా లాడగ.

తను భంగిమ హిమ శృంగము
మినువాకలో తరంగము

వెన్నెలలో స్నానమాడ
క్రొన్ననలల ప్రోవు ప్రోడ్త
స్వచ్ఛ దేహయై నిలిచెను
స్వప్న సుందరయై పొలిచెను
మిరుమిట్లయె నా కన్నులు
ఉరవడించె నా కోర్కెలు.

సమ భంగాకృతి నిలిచెను
సుమ పరిమెళములు విరిసెను

నగ్నబాల నా శశికళ
నగ లలంకరించని కల
తళ తళమని మెరిసె దేవి
తలిరుటాకు మృదువు ప్రోవు
అనుప మాన సౌందర్యము
నిరుప మాన లావణ్యము
ఉద్రిక్తము నా హృదయము
ఉద్గాఢము నా ప్రణయము.

పదములు పూవుల గుత్తులు
మధుపము నా తోడి చిత్తము

సుషమాధారము జంఝులు
తుషారార్ద్రములు తలపులు
అమృత కలశమామె కుకటి
అమరపతి నామె ఎదుట
డమరుక మధ్యమ్ము నడుము
క్రమము తప్పి మది నృత్యము

పారిభద్ర సుమకుచములు
బాహ్లీక సుమ చూచుకములు

ధవళ కమల ముకుళ గళము
నవమాలిక సరము కరము
సౌగంధిక కుసుమ ముఖము
సై రేయక సుమనాసిక
ఇందీవర లోచనములు
మందారక కపోలములు
శేఫాలీ కుటి కైశ్యము
శ్రీఫాలము మాలతి కృతి
పాట లాథ రోష్ఠమ్ములు
ప్రవిమల మూర్తి నిలిచెను
పరమ శోభతాన మగుచు
దివ్యదేవి నా శశికళ
భవ్యమయ్యో నా జన్మము !

ఆవెనుక

చీకటి వెనుకే రాకా జ్యోత్స్నలు
నీ కనురెప్పల నీలిమ వెనుకే

వికసిత నిర్మల విద్యు ద్రోచుల
పకపక నవ్వుచు పాపలు వెలుగును

కాంతి గర్భమున కలవు వర్ణములు
కనుపాపలలో కాంతుల లోతులు

రంగు రంగులై రాగము లీనుచు
శృంగారించును చిత్రము లెన్నో

వర్ణ గభీరము పదముల లోనే
పూర్ణ రూపమై పొలుచును భావము

చిత్ర రీతులలో చెన్ను మీరునే
పత్రరేఖ నీ ప్రణయము దేవీ !

పరమార్థము

"ఓశిల్పి! నీ విద్య ఉపదేశమొసగునది
పరమార్థ మేమం"చు ప్రశ్నించినావు

"సుందరము రేఖలో సొబగైన వర్ణాల
నారాణి మూర్తింప నావిద్య" లన్నాను.

"ఓ కవీ! నీపాట ఒదుగు మెదుగులలోన
చెలువొందు భావమ్ము సెలవీయు" మన్నావు.

"జ్వలిత గీతాతటి చ్ఛలిత కాంతులమధ్య
నారాణి రూపింప నా తపస్స"న్నాను.

"ఓహో నృత్యోపాసి ! నీ అంగహారాల
ఓహరిలు గోప్యమ్ము ఊహేది" అన్నావు.

"నృత్త నృత్యాలలో వృత్తిలో చారలో
దేవి నీకై ఆడి నీవౌదు" నన్నాను.

ఉగాది

ఈ ఉగాది ప్రేమ సఖీ!
నా ఊహల కందవేమి
    కలలోనే వచ్చినావు
    కలలానే కరిగినావు
        ఈ ఉగాది ప్రేమ సఖీ !
        నా ఊహల కందవేమె ?

ఒక కౌగిలి ఒదిగిస్తివి
కికురించితి ఒకముద్దును
    పకపక మను నవ్వులతో
    కకు బంతము కలసినావె
        ఈ ఉగాది ప్రేమ సఖీ !
        నా ఊహల కందవేమె !

గంధ మలది కాన్క లిచ్చి
విందు లిడితి విడియ మిస్తి
    సుందరాంగి చంద్రికలో
    మందుపెట్టి మాయమైతె
        ఈ ఉగాది ప్రేమ సఖీ
        నా ఊహల కందవేమె !

ప్రస్థానము

✿

ప్రేమార్థినై వెడలినానూ
శిల్ప
కామార్థినై కదలినాను !

ప్రకృతి పథములు నడచి
భావ లోకము గడచి

బహుదేశములు విడిచి
పడినాను అడవిలో

ప్రేమార్థినై వెడలినానూ
శిల్ప
కామార్థినై కదలినాను !

వర్ణాలు తూలికలు
పర్ణాల పాలికలు

వస్తువులు చేబూని
ప్రస్థాన మైనాను.

ప్రేమార్థినై వెడలినానూ
శిల్ప
కామార్థినై కదలినానూ !

కంటకావృత సరణి గండశైలాలలో
ఉస్సురని తూలుతూ ఓహోయని పడిపోతి

ప్రేమార్థినై వెడలినానూ
శిల్ప
కామార్థినై కదలినానూ !

ఎన్నాళ్లు ఎన్నేళ్లు
తెన్ను తెలియని ఒళ్లు

కదలికే లేనట్టి
కట్టినై పడిఉంటి

ప్రేమార్థినై వెడలినానూ
శిల్ప
కామార్థినై కదలినానూ !

ఒకనాడు శుభవేళ
వికసించె చంద్రికలు

నాపైన వాలినవి
రూపొందె శశికళా

ప్రేమార్థినై వెడలినానూ
శిల్ప
కామార్థినై కదలినానూ !

మసృణ కోమల కరము
ఘుసృణ పరిమళ స్పర్శ

నాకు ప్రాణము నిచ్చె
నాకు మెలకువ వచ్చె

ప్రేమార్థినై వెడలినానూ
శిల్ప
కామార్థినై కదలినానూ !

కన్ను విప్పితి లేస్తి
కౌగిలిని ఒదిగిస్తి

నా లోన చైతన్య
నా శశికళ! అనన్య !

ప్రేమార్థినై వెడలినానూ
శిల్ప
కామార్థినై కదలినానూ !

✽

శ్రుతిలేని

✽

పాడకే నారాణి పాడకే పాట
పాట మాధుర్యాల ప్రాణాలు మరిగెనే.

రాగ మాలాపించి వాగులా ప్రవహించి
సుడిచుట్టు గీతాల సురిగి పోనీయ కే

పాడకే నారాణి పాడకే పాట
పాట మాధుర్యాల ప్రాణాలు మరిగెనే !

కల్హార ముకుళములు కదలినవి పెదవులూ
ప్రణయపద మంత్రాల బంధించె జీవనము !

పాడకే నారాణి పాడకే పాట
పాట మాధుర్యాల ప్రాణాలు మరిగెనే !

శ్రుతిలేని నా మదికి చతుర గీతాలేల
గతిరాని పాదాల కతుల నృత్యమ్మటే !

పాడకే నారాణి పాడకే పాట
పాట మాధుర్యాల ప్రాణాలు మరిగెనే !

✽

మార్పు

కత్తి పట్టిన చేతికో దేవీ
ఇత్తువేమే సకల సౌరభ పుష్ప దామము !

ఉరుము లురిమే కంఠమున దేవీ
విరియ చేస్తువె మధుర మంద స్వరములే!

తీక్ష్ణ రోహిత పూర్ణ జన్మిని
తీర్తు వేమే దివ్య మంజుల వర్ణములనే !

ఒకరికొకరు

నువ్వూ నేను కలసి
పువ్వులో తావిలా
తావిలో మధువులా !

నువ్వూ నేనూ కలసి
కోకిలా గొంతులా
గొంతులో పాటలా !

నువ్వూ నేను కలసి
వెన్నెలా వెలుగులా
వెలుగులో వాంఛలా !

నువ్వూ నేనూ కలసి
గగన నీలానిలా
నీలాన శాంతిలా !

ఆట పాటలు

✽

వాన చినుకుల ఆట
కోన వాగుల పాట

నీదు సొగసుల కులుకు
నీదు వలపుల పలుకు.

మెరుము తళుకుల ఆట
ఉరుము తబరువుల పాట

నీదు కలతల అలుక
నీదు విరసపు చెళుకు.

మలయా నిలుని జాలు
ఎలదేటి రుతి చాలు

నీదు తియ్యని ఆట
నీదు హాయను పాట.

✽

ప్రణయకోపన

ఏల కోపంవచ్చినదొ నీ
మ్రోల నిలిచిన నన్ను చూడవు
బాలికా నావైపు తిరగవు
పంతగించితివో ?

వీణె మీటిన తీపి పాటలు
వేణు వూదిన గాన మంత్రము
జాణ! నీవై పలుకు లాడవు
ముగ్ధనాయికవా ?

పూల తావుల అలలు చూపులు
మాలతీ వల్లరుల నవ్వులు
నీల గగన విలాస లీలలు
దాచుకొన్నావా ?

కాళిదాస మనోజ్ఞ కవితా
కలశవార్నిధి వీచికలు నీ
కౌగిలింతలలోని వింతలు
నేడు చూపవుటే !

పచ్చ కర్పూరాన వెన్నెల
పసిడి సంజల సంపగులలో
పాటలీ కుసుమాన ఉషనులు
చుంబనము లేవీ !

మేల మాడవు గంధ మలదవు
పూల జడతో నన్ను కట్టవు
వాలు చూపుల నివాళించవు
ప్రణయ కోపనవా !

నేను చేసిన తప్పు లేవో
నేనె ఎరుగను
గాన పూజలో అపశ్రుతిలా
కలత బెడితినొ
ఆన తప్పితినేమొ మోహో
ద్రిక్త విరసముననన్
ప్రాణకాంతా ! పాద పద్మము
మ్రోల వాలుదు

ప్రణయ లీలల
ప్రధమ తప్పిద

మెట్టిదై నను
ఏరికైన క్ష
మార్హమేకాదా ?

✽

రాగిణీమాల

పాడెదను నీకునై పాటలను దేవీ !
వాకలై తేనియలు ప్రవహించు దేవీ !

సుమబాల ప్రేమకై
తమి మీరి ముగ్ధుడై
భృంగ బాలుడు పలుకు
శృంగార కళ్యాణి

పాడెదను నీకునై పాటలను దేవీ !
వాకలై తేనియలు ప్రవహించు దేవీ !

మధు మాస పికరాజు
విధుర సంక్లేశియై
గళమెత్తి కో యన్న
కల రాగిణీ తోడి

పాడెదను నీకునై పాటలను దేవీ !
వాకలై తేనియలు ప్రవహించు దేవీ !

వేసవిని పుట్టిల్లు వెడలిరా నలసించు
వాహినీ సతి కొరకు
వగలు పొగిలే కడలి
ధ్యానమౌ దీపకము

పాడెదను నీకునై పాటలను దేవీ !
వాకలై తేనియలు ప్రవహించు దేవీ!

మేలుకొలుపు

✿

సృష్టి అంతా నిశ్చలమ్మయె
తుష్టి తీరక నేను మాత్రము

కాలమంతా నిదురపోయెను
మేలుకొని నే నొకడ మాత్రము !

మినుకు మినుకను తారకలలో
కునుకు లాడెను కటిక చీకటి

కన్ను మూసిన పూలప్రోవుల
తెన్ను తెలియని గంధ బాలిక !

ఇంతలో ఆ నిశ్చలతలో
ఇంతలో ఆ సుప్త జగతిని

నిదురలోనివి తీయటూర్పులు
చెదరి తేలుతు నన్ను చేరెను !

"ప్రేయసీ !" అని గద్గదికమై
పిలిచితినే వణకిపోతూ !

"ప్రేయసీ !" యని మారుమ్రోగె వి
హాయసీ పథి దెసల దెసలన్నీ !

గాఢ నిద్రను సోలినవి న
క్షత్ర బాలలు ఒడలు తెలియక

వాని సౌందర్యాల మధ్యను
వాలియున్నది ఒక్క సోయగమూ !

"ప్రేయసీ !" యను నాదు పిలుపును
"ప్రేయసీ !" యను మారుమ్రోతయు

మేలుకొలిపెను తార బాలల
మేలుకొలిపెను సర్వ సృష్టిని !

తారకా బాలికల నడుమను
కోరికల ప్రోవైన నిన్నూ

మేలుకొలిపెను పిలుపు పాటలు
జాలిగా ఆనంద భైరవిలో !

సృష్టి అంతా ఝల్లు మన్నది,
చేష్ట లందెను కాల బాలిక
ఘల్లు మన్నది లోకనాట్యము

ఫుల్లమై రస దివ్య పుష్పము
వెల్లువలు గంధములు నింపెన్.

యోగిని

పదము సవ్వడి అయిన
చెదురు నీ యోగమని

హృదయ దేవళ మూర్తి
ఒదిగి వస్తిని నేను.

పూల పూజించితే
సోలి పోవుదు వనుచు

ఆలయపు మోసాల
పూలిడితి పూజిస్తి.

గొంతెత్తి పాడితే
శాంతి పోడి యగుననుచు

లోలోన గుసగుసల
ఆలపించితి పాట.

ఎంత కాలము తపసు
కాంత కోరిక ఏమి

ఎదుట నిలచిన నేను
ఏవరము లిచ్చేను.

సంగీత మేలనే

సంగీత మేలనే
పొంగేటి లయలేల

సంతోషమే లేని జన్మకిక
సంగీత మేలనే !

గొంతెత్తి పాడితే
గొణుగు పోయెను స్వరము

పాట రానేరాదు
బరువెక్కెనే గుండె
సంగీత మేలనే ?

ఆనంద రూపమై
అవతరించే గీతి

ఆర్తిలో వికృతమై
అపయానమై పోవు
సంగీత మేలనే ?

కోకిలల కంఠాన
మూకత్వమే చాలు

సెలయేటి పతనాల
జలము లింకిన చాలు
సంగీత మేలనే ?

నీవు కనరాని నా
కీ విపంచది ఏల

ఈ వేణు వెందుకే
ఈ హంగు లెందుకే
సంగీత మేలనే ?

పొంగేటి లయలేల
సంతోషయే లేని జన్మకిక
సంగీత మేలనే ?

నాట్యము

నారాణి కళ్లలో నాట్యమొక్కటి మెరిసె
తారాపథాలలో తళుకు హంగులు మురిసె !

నారాణి కనుబొమలు నాట రాగము పాడె
కారుమబ్బుల దరులు పూరించె శృతిమోడి !

నారాణి కనురెప్ప లారజము వాయించె
నీరధి నీలాలు ఆరభటి మ్రోయించె !

నారాణి కనుపాపలే రాగ తాళగతి
చార సంచారిగా సలిపె లాస్యము నిరతి !

నారాణి కళ్లలో నాట్య నాయకుడేను
ధీర లలితుడను, స్వాధీన పతికవు నీవు !

అక్కసురాలు

ఒక్కణ్ణై ఎక్కణ్ణో
సుక్కి పోయి సోలి యుంటి

మక్కువ ఇంతైనలేని అక్కసురాలా !
టక్కులాడి వై పోతివె
చక్కని దానా !

నా పూజలు మోసమంట
నా ప్రార్థన వ్యర్థమంట

నన్నొక పెరవాని చేసి
అన్నెకారి మాటలంటి వక్కసురాలా !
టక్కులాడి వై పోతివె చక్కనిదానా !

ఒక్కణ్ణై ఎక్కణ్ణో
సుక్కి పోయి సోలి యుంటి !
మక్కువ ఇంతైనలేదె అక్కసురాలా !

కళ్లల్లో శీతలాలు
కంఠంలో కర్కశోక్తి

పెడమోమై తిరిగినావు
ఎడదలోన దయలుమరిగి అక్కసురాలా !
టక్కులాడి వైపోతివె చక్కనిదానా !

ఒక్కణ్ణై ఎక్కణ్ణో
సుక్కిపోయి సోలియుంటి !
మక్కువ యింతైనలేదె అక్కసురాలా !

ఒక్కణ్ణై ఎక్కణ్ణో
చిక్కినట్టి ఆశ మనసు

ఉళ్లంటక ఏళ్లంటక
ముళ్లదారి పడిపోతిని అక్కసురాలా !
టక్కులాడి వైపోతివె చక్కనిదానా !

ఒక్కణ్ణై ఎక్కణ్ణో
సుక్కిపోయి సోలియుంటి
మక్కువ ఇంతైనలేదొ అక్కసురాలా !

ఒక్కణ్ణై ఎక్కణ్ణో

ఒదిగి ఉంటి ఉస్సురంటు

కలలు రాక నిదురలేక
కళల సీమ చేరబోక
ఏలాగో ఏలాగో
కాలంతో ప్రవహిస్తిని హో అక్కసురాలా !
టక్కులాడి వైపోతివె చక్కనిదానా !

ఒక్కణ్ణై ఎక్కణ్ణో
సుక్కిపోయి సోలియుంటి
మక్కువ ఇంతైనలేదె అక్కసురాలా !

✽

త్రప

బాలవే నీ వెపుడు గోలవే బేలవే !

పరమ సౌందర్యాలు
పడతి నీ కన్ను లే

కన్నులలొ దాగెనే
కమ్మన్ని సిగ్గోటి

బాలవేనీవెపుడు గోలవే బేలవే !

ఉదయ సంధ్యల ఎరుపు
పెదిమెలలొ తేనెలే !

తేనెలో ఒదిగింది
తీయ తీయని సిగ్గు !

బాలవేనీవెపుడు గోలవే బేలవే !

తంత్రి స్పందించుతూ
తల వాల్చి పాడుతూ

నను ముంచు నీపాట నవ్యమయ్యే సిగ్గు !
బాలవే నీవెపుడు గోలవే బేలవే !

నీలి కనురెప్పలో మేలమాడే సిగ్గు
అందాల నీపెదవి అలమిపోయే సిగ్గు

దివ్య గాంధర్వాన నవ్యమయ్యే సిగ్గు
సిగ్గులను మాలగాచేర్తువే నాగళము !

బాలవే నీవెపుడు బేలవే గోలవే !

ఆశయదేవి

✿

మనుజుని మనుగడ కని కృంగితివే
మినుచెలి శశికళ ! ప్రణయపు దేవీ !

తనలో దాగిన రాక్షసత్వమును
మనుజు డెప్పుడూ చెరవిడదీయును

చీల్చి చెండునట మానవత్వమును
నిల్చును ఘోరపు నీడై దారుల
మనుజుని మనుగడ కని కృంగితివే !

ఆతని వెలుగై ఆతని ఛాయగ
అనుసరించునట ఆశయ దేవియు

మనుజుని లోనే మను దేవత్వము
ప్రణయ పవిత్రము పరవశ రూపము
మనుజుని మనుగడ కని కృంగితివే !

కాకుము పసరము కాకు పిశాచివి
లోక కంటకుడవై కూలకురా

ఊకొట్టుము ప్రణయోక్తుల నరుడా
సేకరించుమురి శిల్ప రసజ్ఞత

నీకై నేనే నిత్యసుందరిని
నీ ఆనందము నేనే యనునట

నియత దేశికై ప్రియము సెప్పునట
మనుజుని ఉన్నతి కని పొంగెదవే !

కవియే యైనా గాయకుడైనా
రవిలా రంగుల రాజే నయినా

రాజ్యము లేలే పూజ్యుడె అయినా
ఆజ్యము పోసే యాజ్ఞికుడైనా
మతకర్తైనా శ్రుతికర్తైనా
వితములు తెలిసిన విజ్ఞుండైనా

ఆశయ ప్రణయము ఆరాధించును
ఆమెయె అతని ఆతంబనమని

మనుజుని మనుగడ వినిపించితివే

మినుచెలి శశికళ ! ప్రణయవు దేవీ !

నీవే ఆశవు నీవే ఆశయ
మీవే నా దివ్యావతరణమవు

నేను నరుడనట నీ వమర్త్యవే
నీలో నేనై నాలో నీవై

మనుజుని మనుగడ వినిపించితివే !
మినుచెలి శశికళ ! ప్రణయిని ! దేవీ !

✽

పూజ

అందుకోవేమే శశికళా !
నా పూజ
సుందరివి నీవె కాదంటవే !

ప్రణయ పళ్లెరమందు
పండ్లు కాంక్షల గములు

చూపు పూవుల సరులు
ఊపిరే ధూపాలు

అందుకోవేమి ఓ శశికళా
నా పూజ
సుందరివి నీవు కాదంటవే !

తనువె నీ ఆలయము
మనసె ఆసనమయ్యె

నామ మంత్రము జపము
నా గీతములె వినతి

అందుకోవేమి ఓ శశికళా
నా పూజ
సుందరివి నీవు కాదంటవే !

కలల నారతి నిచ్చి
కళ నివేదనమిస్తి

అందుకోవేమి ఓ శశికళా !
నా పూజ
సుందరివి నా దేవి వే నీవు !

కంటినవ్వు

✿

లోచనాల హాస లీల
లోలాక్షీ ప్రియ బాలా !

కనుపాపలలో హేలలు
కనురెప్పల నీ లాలూ

కనుకొలకుల కాంతి కళలు
కనుమూతల పైన కలలు

లోచనాల హాస లీల
లోలాక్షీ ప్రియ బాలా !

పక్ష్మకాండ పటము వెనుక
భరత నృత్య లాసికయై

అష్ట నాయికల భావము
లభిన యించె కంటి నవ్వు

లోచనాల హాస లీల
లోలాక్షీ ప్రియ బాలా !

అంతప్రేమ కనుల వెలిగె
ఆరతిగా అందుకొంటి

వెలుగుల వెనకై నవ్వులు
తలపై వాలిన పువ్వులు

లోచనాల హాస లీల
లోలాక్షీ ప్రియ బాలా !

చక్ష్వాంచల స్రావితమై
పక్ష్వాంచలములు చిందెను

ఆనందపు భాష్పములో
ఆర్తి కరిగి కన్నీ రో

లోచనాల హాస లీల
లోలాక్షీ ప్రియ బాలా !

ఆకాశము నీల నిధులు
అబ్ధి సుడులు నీలపథులు

నీ కన్నుల నీలి నవ్వు
నీరు నింగి తెలిసేయునో

లోచనాల హాస లీల
లోలాక్షీ ప్రియ బాలా !

✽

అటు ఇటు

ఈపక్క ఓనవ్వు ఆపక్క ఓనవ్వు
నవ్వు సుమమాలలో నేనూ
నవ్వు పరిమళమూర్తి నువ్వూ !

ఈవైపునోచూపు ఆవైపునోచూపు
చూపు చూపుల నడుమ నేనూ
చూపులో సౌందర్య మీవూ !

ఈ సాయనో పాట ఆ సాయనో పాట
పాట ఫణతుల నడక నేనూ
పాటలో మధురత్వ మీవూ !

ఈదరిని నా ఎడద ఆదరిని నీ ఎడద
ఎడద ఎడదల కోర్కె నేనూ
ఎడద పడదల ప్రేమ నీవూ !

ఇంద్రజాలిక

✿

చూపులోనే ఇంద్రజాలము చూపుటేలా మాయలాడీ !
రూపమెరుగని మంత్రలోకము ప్రాపణమ్మయె ధూర్తురాలా !

నేల బరువులు దాటిపోతిని నీల గగనము తేలిపోతిని
కాలమావల గడచిపోతిని వేలలన్నీ మీరిపోతిని

మూలమే ఆ భాసితమ్మగు లీలలోనే చేరిపోతిని

చాలునే నీ ఇంద్రజాలము
చాలునిక నా అవధి మించిన
సాధ్బు తానందమ్ము దేవీ !

నెమలి పింఛెము తిప్పవేమే
నేలపైనా కాలు నిలుపుము

వాలనీయవె చూపులను
ఈ లోక సామాన్యాలపైనన్.

✿

విప్రలంభ

నను జూసి నవ్వేవు
కను మూసి పోయేవు

నా బాధ నాలోనె
నా గాధ నాకేనె

దేవి నాతో నీకు ఈ విప్రలంభమటె
నీ వియోగము నాకు భావాధికరణమటె.
జాతిబాధకు కృంగి జాతి ముక్తికి పొంగు
జాత్యభ్యుదయ శిల్ప కల్పనాశయ హృదిని.
ప్రజల బ్రతుకులలోన ప్రతిభ ప్రజ్ఞలు నేను
ప్రజల హృదయములలో భక్తి భావము నేను.
దేశోన్నతీ యత్న దీక్షాఽ విజృంభుడను
దేశ సౌందర్యరస దీప్త జీవిని నేను.
కుంచియలు రంగులతొ కొలువచేరితి నిన్ను
శిల్ప పీఠి వసింప చేరరావే దేవి.
నను జూసి నవ్వేవు
కను మూసి పోయేవు

నా బాధ నాలోనె
నా గాధ నాకేనె !

ఒఖ్ఖణ్ణి

మరచి పోవబోకె బాల
మరచి పోవకే !
అరచి అరచి పిలువలేను
తరచి తరచి వెదకలేను

పరచి ఎగురు కాంక్షలలో
పడి చెదురును నా గుండెలు - మరచి పోవకే !

హోరుమనే వారి రాసి
మారుమోగెను నా పాటలు

విరిగిపడే తరగలలో
నురుగులలో పరుగులలో - మరచి పోవకే !

ఒఖ్ఖణ్ణే ! యిసుక బయలు
ఒఖ్ఖణ్ణవ్ ! నీరు దెసలు
కదలి పోవు దూరాలూ
చెదరిపోవు మేఘాలూ - మరచి పోవకే !

అదుముకొన్న నీ తలపులు
చిదిమిరాల్చు హృదయ సుమము

ఏరలేను రేకలన్ని
ఏరలేను పుప్పొడినీ !

మరచి పోవకే బాల
మరచి పోవ బోవకే !

సంప్రార్ధన

సకల శిల్ప సుందరాలు
సర్వ రసానందాలూ

వెలసిపోవు దేవళాన్ని
చెలీ నీకు నిర్మించితి.

అధి వసింపరావ నీవు
అవతరింప ఒప్పుకున్న

ముందు యుగపు రసికాత్ములు
ముందు యుగాల సహృదయులు

పాడుపడిన సౌందర్యము
పరికిస్తూ నిట్టూర్తురు.

ఏదో ఒక విడ్డూరము
ఏదో ఒక ప్రణయభంగ

మావహిల్లె నిచటనంచు
అంజలితో కంట నీరు

అర్పింతురు నీకు నాకు.

నారాణి

నారాణి నావాణి నా శశికళవు దేవీ !
నా బాణి నాప్రాణప్రియ రహశ్యము నీవు నీవే !

కనుమూసి కనుతెరచి కనలేని కలగనుచు
వినువీధిలో కొత్త మనుగడలు మలిచానె
.......నా రాణి

వెన్నెలను వన్నెలను మిన్ను కన్నె వెదికి
నిన్నె నాసొద నడుమ విన్న దే నేనెరుగ
.......నా రాణి

విడబోని నాకోర్కె కడపలను ఎరుగదే
ఎడమీని నాకొలువు జడతనే తెలియదే
.......నా రాణి

నీప్రేమ కనలేక ఈసీమ మనలేను
నన్నోముదువౌగాక నా బ్రాములే నాకొ !
.......నా రాణి

కలలు విరుగగ నీకు తలపు లందగరావు
తలపులే కళంపస వలపు వరమీయవే !
.......నా రాణి

గంగాధర

నీలి ఆకాశాలు కన్నులు
నీలి ఆకాశాల చుట్టిన
ఆశలే నీ కంటి కాటుక - ప్రేయసీ !

ఆ, దివ్యపథముల వెలుగు కాంతులె
అంబురుహ నేత్రాంచలములను
కూడుకొన్నది నిర్మలాంబువు
లతి పవిత్రము లుగ్దతమ్ములు.

లోక బాధలు లోక దుఃఖము
చీకటై ప్రజ డాయు మూర్ఛత
శోక భావోద్దీపనములై - కలతనింపెనటే !

ఆర్తి పొంగెను
అలముకొనె కన్నీరు వాహిని
అలలుగా ఆవర్తములుగా
అవధులన్నీ ముంచివేసెను.

వ్యోమ కేశుడ జడల విప్పితి
శ్యామ కైశ్యము దెసల పర్వెను
దుఃఖ జాహ్నవి కౌగిలిస్తూ
తోయముల తనలోన ధరాతలకు
జూటమై శశి శోభితాలంకృతుల నెలనై
పొలితునో దేవీ !

కళా పరిమళము

నేను : నన్నెటే ప్రేమింతు ఓ రాణి
నన్నెటే పాలింతు ఓ దేవీ !

ఆమె : నిన్నెరా ప్రేమింతు
వెన్నెలల బాలరా

నేను : నీ అంద మెక్కడే
నా అంద మెక్కడే
దివ్యపథములనుండి దిగివచ్చు మూర్తి వే
భూమిపై తిరిగేటి పోటు మానిసినేను !

ఆమె : భూమి నందముసేయు పుణ్యమూర్తివి నీవు
ఆకాశ యాత్రలో అంతు దొరకని నేను
నీహృదయ మందమురా
నీసొగసు నీవెరా !

నేను : అర్ధచంద్రుడు నుదురు అమృతరసమే పెదవి
ఆకాశగంగ నీ అంగ విన్యాసాలు
నీవు సొబగుల రాణివే దేవి
నేను కర్కశ మూర్తినే చెలీ !

ఆమె : నీవదన ముషసురా నీచూపు కాంతిరా
నీపెదవిలో పాట నృత్యాలు సలుపురా
అందమే నీదిరా
సుందరిని నేనురా !

నేను : నీమూర్తి పూజింప
ఈ మనుజు లెందరో
అందరిలొ ఒఖ్ఖణ్ణి
ఆశ నాకేలనే !

ఆమె : బ్రతుకు సర్వస్వమ్ము
పరమ నైవేద్యమౌ
నీపూజె పూజెరా
నీవు నేనేనురా
నీకు నేనై వెలసి
నాకు నీవై పొలసి
ఇరువురము బ్రతుకులో
కెరలింతు మందదాలు !

నేను : ఇరువురము లోకాన

ఆమె : పరిమళింతుము కళల
ఇరువురము ప్రేమికుల
మిరువురము శిల్పులము.

✽

నిత్య యౌవన

నాలోన నీవూ నిత్య యౌవనవూ
ఏనుమాత్రం దేవి ఏళ్ల జీర్ణింతునే ?
　　　నాలోన నీవూ నిత్య యౌవనవూ !

పాపలలొ పాపనై పాడెదను ఆడెదను
అందాల పడుచుతో గంధాలు ప్రసరింతు,
　　　నాలోన నీవూ నిత్య యౌవనవూ !

పూలమాలలు తాల్చి మేలమాడుదు నిన్ను
కాలాన్ని కట్టేసి కాలకిందను రాతు
　　　నాలోన నీవూ నిత్య యౌవనవూ !

శక్తి కృంగని బుద్ధి రక్తి పొంగిన వృద్ధి
నీపాట శ్రుతికలిపి నీతొ నృత్యముసేతు
　　　నాలోన నీవూ నిత్య యౌవనవూ
　　　ఏనుమాత్రం దేవి ఏళ్ల జీర్ణింతునే !

అనుగమము

నువు పరుగిడితివి నువు ప్రవహిస్తివి
నిను వెనుదవిలితి వనసఖి నామనిలా !

పికీ బాలనై వికా వికలుగా
కుహుకుహు నిస్వన విహారగీతము
రసాల నిష్కుట ప్రసారి తాంతర
కషాయ జేమన కలరాగంలో
రెక్కలు చాచిన నీవెనకాలే
సొక్కుచు కోకోయని నే నెగిరితినే !

నీలం నీడల హేలాలీలలు
జాలవి చిత్ర వికల్పవు విభ్రమ

దృశ్యా దృశ్యపు ప్రదినివైతివి
వశ్యుడనై నిను నిత్యప్రియగా

వరియించగ నిన్ననుగమియించగ
వారిద నాయక వేగాత్ముడనే !
శూన్యా శూన్యాంతపధి తారా
కన్యవు రోహిణి వసదృశమూర్తి వ

నన్యవు చొచ్చుకుపోతివి గగనము
పుణ్యవతీ నే నిన్ననురించెదను

కలాప్రపూర్ణుడు రాకా చంద్రుడు
కళానిలయ ఆతారక చేరేరీతిని
ఉదయం సాయం సంధ్యలలో
పదవిన్యాసము నృత్య గతులలో

ఉషా రమణిలా తుషారార్ద్రవై
పుషితారుణ రాగ ప్రపుల్లవు

నువు పయనించితె ! నీవెనకాలే
దివమణి సూర్యుడనై నే వెన్నాడితినే !

నువు పరుగిడితివి నువు ప్రవహిస్తివి
సవసవ నీకౌ నాడెను దేవీ

పడతీ నినునే పరుగులపట్టితి
పకపక నవ్వుతు నను జేరితివే
బ్రతుకున ఒకటై నువ్వూ నేనూ

పవన హృదయమున పరిమళమౌతూ
పయనమైతిమే పరమ శోభకై.

కారణము

ఎవరు నేనీ జగతి
ఎవరు నేనీ ప్రగతి

అవధి మించిన కాంక్ష
అందుకొను నా స్వగతి.

జవమూను నా కలలు
జగమేని దరియునా

సొగలు పొగలై బ్రతుకు
సోలినది నీమ్రోల.

ఆశయము వలదేని
ఆవ లేమున్నదో

ఆలయము కలదేని
ఆవలీవల నిజము.

బ్రతుకె ఒక యోగమై
వితములను మది కలుపు

సతియె అవధికి రూపు
కారణము నీ వలపు.

మార్గము

అడుగడుగునకీ ప్రపంచపు
చెడుగు హృదయము లెన్నొ చుట్టీ

కడుపునకు ఇసుమంత దొరకని
బడుగు బ్రతుకుల తూలునడకలొ

మధురమెక్కడ మంజులత లేవీ ! - దేవీ !
మార్గమెక్కడ స్వర్గ మెక్కడనే !

ప్రేమ లెరుగని నీమమెంచని
తామసులతో దట్టమీ మహి

కోటి రూకల గుణములెంచే
కూళలెందరొ ఏలునీ భువి

మధురమెక్కడ మంజులత లేవీ ! - దేవీ !
మార్గమెక్కడ స్వర్గ మెక్కడనే !

క్రోధవహ్నులు కుములు నాడులు
సాధకమ్ములు మృత్యు కీలలు

సాధు దేశము శాంతమేగతి
సత్యశీలాఽ హింసలేపధి

మధురమక్కడ మంజులత లవియే ! - దేవీ !
మార్గమదియే స్వర్గ మదియేనే !

ఇష్ట దేవత

హితులందరికి వారి ఇష్ట దేవులు కలరు - నాబ్రతుకు
శ్రుతికలిపి వలపించు సతి చతురవుదేవీ !

యెంకొక్క దేవత్తై యెలిసెనట ఒక్కరికి
యెనక జల్మమునుండి యెన్నేని జన్మాల
హితులందరికి వారి ఇష్ట దేవులు కలరు !

హృయేశ్వరీ దివ్య పదపుష్ప పూజార్థి
వకుళ మాలికవైచి వరియించె సుఖుడొకడు
హితులందరికి వారి ఇష్ట దేవులు కలరు !

కిన్నెరీబాలా ప్రసన్నాఽవిలాసితుడు
రసవాహినీ స్నాత రమ్యావాజ్మి యొకండు
హితులందరికి వారి ఇష్ట దేవులు కలరు !

మఘవమస్తక మకుట మాణిక్యమై వెలయు
ఊర్వశీదేవి ప్రేమోల్లాసి చెలియొకడు
హితులందరికి వారి ఇష్ట దేవులు కలరు !

మందార పుష్పార్ద్ర సుందరీ మృదుహాస
చెంద్రికా శోభితులు జంటకవి హితులొకరు
హితులందరికి వారి ఇష్ట దేవులు కలరు
నా బ్రతుకు
శ్రుతికలిపి వలపించు సతివి చతురవుదేవీ !

ధ్యేయము

నా బ్రతుకొక పరిమళార్ద్ర
నందనోద్యాన వనము
నందనాన విహరించే సుందరివే ప్రేమరాణి !

నాప్రజ్ఞే నీ లోకము
నవ నవోన్మేషణమ్ము
నవ్యతలో నిత్యోదయ కల్యాబాలవే నీవూ !

నీ ఒదిగిన నా స్వప్నము
నింగివరకు స్పందించును
నిద్రాస్వాప్నిక పులకిత నిరుపమరూపవె సఖియా !

నా ప్రణయమె నీ రూపము
నా ఆత్మే నీ ప్రాణము
నీకునాకు విడుటేది విరహమేది !

మన ప్రణయమె మన ధ్యానము
మన యోగమె మన ధ్యేయము
మనమే మన ధ్యాతలమై
మనుదుమే అనంతమందు.

పిలుపులు

"బాపిరాజా !" అన్న ఏపిలుపు నేవిన్న
ఊపుదును మూర్ధమ్ము ఊకొట్టి మాటాడి.

"బాపిబావా !" యంద్రు పలుకరింతురు హితులు
పారిజాతసుమమ్ము పట్టుదును అంజలిలొ.

"బాబు !" యని మానాన్న పరమప్రేమను పిలువ
ప్రత్యక్షమయ్యెడిది పాలసంద్రము నాకు.

"నాన్న" యని మాఅమ్మ నన్ను దివ్యయైపిలుచు
నాకు పులకలుకలిగి నాకమ్ము అంటుదును

"హో శశికళా ప్రియ భావుకా " అనుహూతి
ఉజ్వల రసానంద దివ్యానుభూతియే, ఓ దేవి !

నర్తకి

భూలోకానికి పూర్వపువైపున
ఆకాశానకు ఆవలిదెసలో

మూర్తించినదొక నర్తన శాలా
స్ఫూర్తిత వర్ణాతీత ప్రభాసము.

సముచిత వేషా సుందర రూపవు
విమల విభూష విచిత్రవి యచ్చర

వై పారిభద్ర మందార కుసుమ
మాలా చర్చిత వేణీ భరవై

రంగస్థలాన అవనిక ముందర
శృంగారవతీ నిల్చినావటే !

అచ్చర పడతులు హంగైపొల్చిలి
ఆ తోద్యమ్ములు నాల్గు వాద్యములు

తతానద్ధ సుషిర ఘనాలంకృతలై
చతురలు,తౌర్య త్రికమునకు శలలు

నృత్య నాయికా ! నీకెలకులలో
నిల్చిరి వివిధాలంకృత నాట్యవేషులై !

సభానుమతిగొని నమస్సు లిడితివి
సమందహాసపు మృదంగ వందన

మాచరించితివి కాకలి కంఠము
నాలాపిస్తివి అస దృశరాగము

పుష్పాంజలివై దేవసన్నుతిగ
పూర్వ రంగమును ప్రారంభిస్తివి.

స్వరజతి నొక్కటి నృత్త విలాసము
విరచిత మంజులగతీ విశేషము

తకతక ఝుంతర తళాంగుధత్త
త్తై ధత్త త్తై యని శబ్దములో

ముక్తాయించితి మృదంగ నాదము
రక్తి కొలుపగా మెరుము తీగెవై.

అతి లోకాలంకృత నాట్య మంది
రాంతర సభలో నే నొక్కడనే

నాయకుడను సభ్యులునై కెరలితి
నాకై నీనాట్యము నీ విద్యలు

సౌందర్యము గాంధర్వము సౌష్టవ
సౌహార్ద సుభగ సౌశీల్యాలును దేవీ.

శృంగార రసాంచిత విరహోత్కం
ఠాంగహార కరణార్ద్రిత గీతము

ఆ లోలిత రస పరిపుల్లసార
భాప్లావిత పరమభావ చలితము

హావీభావ విలసత్కృతాభినయ
హ్లాదము నద్భుతనృత్య మొనర్చితివే !

అటుఖండిత విటువాసక సజ్జిక
వభిసారిక వొక్కసారి ప్రోషిత

భర్తృక వొక్కట కలహాంతరితవు
స్వాధీన పతికవు స్వీయవు ప్రౌఢ

వఖిల రసాధిదేవత వనన్యవు
వాచ్యాభినయ విశారదవతివా !

✽

వర ప్రదానము

దివ్యభూలకెటకొ తేల్చుకొనిపోతివే !
దీనజీవినినన్ను దివ్యుణ్ణిచేసితే !

దేహమే శల్యమై
దినదినము కృశియించి

నీవుదర్శనమీని నిముసమొకయుగముగా
తోవ తెలియని అంధజీవినై కుందితిని

దివ్యభూముల కెటకొ తేల్చుకొని పోతివే !
దీనజీవిని నన్ను దివ్యుణ్ణిచేసితే !

నీకె గురువును నేను
శ్రీకమల పరిమళా

దేశికుడ ప్రియుడనై ఆశించి భాషించి
దీక్షలో శిల్పవిన్యాస పులకితుడనై
దేవి నీరాకకై తీవ్ర వేదనపడితి !

ఏ ముహూర్తపు బలిమొ
ఏ పూర్వ పుణ్యమో

అమృత వాహినిరీతి అవతరించితివీవు
ఆనందరూపవై అధివసిస్తివి మ్రోల

దివ్యభూముల కెటకొ తేల్చుకొని పోతివే !
దీనజీవిని నన్ను దివ్యుణ్ణిచేసితే !

హృదయాన మోముంచి ఒదిగితిని ఒడిలోన
కదియించి కౌగిటను నుదిటపై చుంబించి

"ఓప్రభూ నీవిద్య
నా ప్రణయ" మన్నావు
సౌరభావృత హస్త
సంస్పర్శ ఓషధై

నూత్న శక్తినిపొంది నూత్న జీవమునంది
యత్న కార్యోన్ముఖుడనై నిలిచితేరాణి!

దివ్యభూముల కెటకొ తేల్చుకొనిపోతివే !
దీనజీవిని నన్ను దివ్యుణ్ణిచేసితే !

పూల బాలిక

పూల వనమున కలిసినామూ
నారాణి నేనూ
పూల పరిమళములో మెలిసినామూ !
పూల ....

పూలలో ఉదయించి
పూవులా తానిలిచి
పూలజల్లుల నన్ను
సోలించె నాదేవి !
పూల......

తనకొరకు నే వెదికి
జనపథములే తిరిగి
వనరు నా బ్రతుకులో
వనల లక్ష్మియై వచ్చె !
పూల......

తనవనము తానంట
తన పూలు తానంట
తన పూలగంధముల
నన తేనియలె తాను !
పూల......

నాసందిటను ఒదిగి
నన్ను వనమున త్రిప్పి
పూల పుప్పొడులలో
సోలు తన్నే చూపె
పూల......

ఏపూవు తాల్చినా
నా పొందిటను తానె
ఏగంధ మలదినా
ఏకమటనేఁ దాను

పూలవనమున కలసినామూ
నారాణి నేనూ
పూలపరిమళములో మెలిసినామూ !

యుగ్మము

అతడు : నీవు నేనే సఖీ!
ఆమె : నీవు నేనే సఖా !
అతడు : వర్తన మహానదీ పంకజోద్భవులమై
ఆమె : పై కెగసి పుల్లమౌ పద్మయుగ్మము మనము

అతడు : నీవు నేనే సఖీ !
ఆమె : నీవు నేనే సఖా !
అతడు : సకల ప్రజారణ్య సంజాతులము ప్రత్యా
ఆమె : షాకాశ గాయకులు భరతపక్షులము మనము

అతడు : నీవు నేనే దేవి !
ఆమె : నీవు నేనే ప్రభూ !
అతడు : ఈ మహానంత విశ్వైక పథగాములము
ఆమె : స్వేచ్ఛాప్రకాశ తారాద్వయమ్మును మనము !

ఎండిమియాన్

(1) కొండతిరిగీ కోనతిరిగీ
కోన మధ్యను కొండవాగును
బండరాళ్లను పతనమయ్యే
పండువెన్నెల పరుగులెత్తే,

లోయ చేరానే !
ఓనా వెన్నెలా బాలా !
సోయగాల లోయ చేరానే !

(2) అడివి చెట్లూ నిడివి లతలూ
జడుల రాలే కడిమి పూలూ
కడిమి పూవుల కథల వింటూ

నడక సాగితినే !
ఓ కడలివెన్నల ఒడలుదానా,
గండశిలపై విడిది చేశానే !

(3) గండశిలలను కొండవాగూ
నిండుగొంతుక నినదమిస్తూ

పదములాడుతు పరుగు లెత్తేనే !
ఓ ఉదయకమలం పెదవిదానా,
నదిని చేరే శిలను డాసితినే !

(4) చెట్లమీదే చంద్రబింబం
చెట్లకొమ్మల చంద్రకిరణం
చెట్లపూవుల వెన్నెల వియ్యాలే

ఓ చిత్రకంఠము పలుకుదానా.
పూలతేనెల వెన్నెల కలిసేనే !

(5) గండశిలపై మేనువాల్చితి
కొండవాగూ పాట పాడెను
వెండి వెలుగులు నన్ను ముంచెను

ఓ నిండువెన్నెల నీటులాడీ
పండుకొనుచూ నిదుర కూరితినే !

(6) పరిమళాలూ దెసల నిండెను
పరుగులెత్తే వాగు పాడెను
వాగుపాటతో చిన్నిపులుగులు

మూగ గొంతుల శ్రుతులు కలిపినవే
ఓ తామరపూవూ మోముదానా
తోగుపాటలు జోలపాడినవే !

(7) మూడువేలా ఏళ్ల వెనకే
ఈడువచ్చిన గ్రీకు బాలుడు
ఆడుకొనెనే గ్రీసుదేశానా

ఓ అడవిమల్లెల అందందానా
గ్రీకు బాలుడు ఎండీమియానంటా !

(8) ఎండీమియాను అందకాడూ
అందమునకే అందకాడూ
గంధములు తావిందులిడు అర
విందముఖమువాడు కందునిపోలే

సుందరుడు ఆ ఎండిమియానంటా
ఓ చెందమ్మీ మోముదానా
ఎండీమియానూ గ్రీకుబాలకుడే !

(9) ఆలమందల తోలుకుంటూ
చేలదాపుల ఏటిబడ్డుల
తేనెపాటల పాడుకుంటూ

తానె తిరిగెనె ఎండీమియానంటా
ఓ మీనుకన్నుల మించుబోడీ
కోనలోనే ఆవులకాసే గొల్లవాడే గ్రీకుబాలకుడూ !

(10) వెలిగిపోయే కలువ రాజూ
కలిమిలల్లిన కడలి రాజూ
బలము పొదిగిన పర్వత రాజేనే !

ఓ బొగడపూవుల ఊర్పుదానా !
ఆలకాసే ఎండిమియాను ఏటిలో నే,
పెద్ద రాయిని నిద్దుర జోగేనే !

(11) కొండపక్కా వాగులోనే
గండ శిలపై నిదురపోయే
ఎండిమియాన్ని నువ్వు చూశావే

ఓ నిండువెలుగుల నిశల రాణీ
ఎండిమియాను సుందర రూపము
నీదు చూపుల తళుక్కు మన్నాదే !

(12) నిదురపోయే ఎండీమియానూ
కన్ను తెరచీ నిన్ను చూసెను

ఇరువురి చూపులు కలిసిపోయెను
ఇరువురి మనసూ లేకమయ్యేను
ఓ వలపుల వెన్నెల పడుచా
నింగినువ్వూ నేలపై నే ఎండిమియానంటా !

(13) నేలపై అత డందగాడూ
నింగిపై నీ వందకత్తెవు
ఇద్దరి అందాలేకమైతే
ఏడులోకా లందాల వెలుగునే

ఓ దివ్యసుందరీ వెన్నెల బాలా !
దివ్య సుందరుడతడు లోకంలో !

(14) నీవు వలచిన ఎండీమియాను
నిన్ను వలచిన ఎండీమియానూ
నీవుతప్పా ఇతరం లేదా అందాలవానికి

నీవె బ్రతుకూ నీవే సర్వం
నీవే నీవేనే
ఓ నిండువెలుగుల నింగి సుందరీ
నీవేహృదయం నీవేప్రాణం నీవే నీవేనే !

(15) కన్నులందూ వెన్నెల వెలుగూ
వెన్నె లేసే ఆతని ఊర్పూ

వెన్నెల లేనీ చీకటి రోజుల
కన్నులువాడీ కట్టిబారి తా
మూర్ఛ మునిగెనే
ఓ శీతలాత్మా చిత్ర దేవీ !
వెన్నవలె నీమనసూ కరిగిందే !

(16) ఆతని ప్రేమకు పొంగిపోతివి
ఆతని సొగసుకు అలరిపోతివి
ఆతని అందం, అందం నీదీ
అలలూ అలలా కలసిపోయితివే !

ఓ వెన్నేలా చిన్నారి పడుచా
మీ కలియక దేవులు మెచ్చరే !

(17) జలజల పోయే వాగు మధ్యను
శిలాతల్పం పవ్వళించీ

కలలుకంటూ నిదురపోతిని

నిదురపోయే నాపై వాలితివే !
ఓనా వెన్నె వన్నెల రాణీ
నిదురలో నన్ను కౌగిలి చేర్చితివే !

(18) నిదురపోయే నన్ను చూచీ
నాపై వాలిన నిన్ను చూచీ
గురువు "కూల్డ్రే" చిత్రం లిఖియించె

ఓనా బ్రతుకు తెరువుల ప్రవిమలాంగీ
"ఎండిమియానని" చిత్రం పేరుంచే !

(19) చిత్రం చూచిన పెద్దలంతా
చిత్రమెంతో గొప్పదనిరీ
చిత్రం వ్రాసిన చిత్రకారుడు
ఎండీమియాన్ని చూచేనన్నా రే

ఓనా నిత్య ప్రణయినీ
చూచిన సత్యం నీకే తెలుసునే !

✽

మన చెలిమి

✿

నా సఖీ మన చెలిమి
వేసటేనట భువికి

కాసంత ఉపకారి కాదంట మనుజునకు
నా సఖీ ! నా సఖీ !

జీవిత విధానాలు
భావి కర్తవ్యాలు

ఎరుగ లేనే లేని
ఎదురుకోనే లేని
పాట లెందుకటంచు పదములేలా అంచు
పలుకుదురు భాషణలు చిలుకుదురు దూషణలు

నా సఖీ మన చెలిమి
వేసటేనట భువికి !

జుమ్మ్మను మధుర శ్రుతి
తుమ్మెదలు ఆడవా ?

కొమ్మ కొమ్మకు తేలి
కోకిలలు పాడవా ?
అవి వట్టివమ్మంట అర్థరహితమ్మంట.

నా సఖీ మన చెలిమి
వేసటేనట భువికి !
కాసంత ఉపకారి
కాదంట మనుజునకు !

పుష్పగంధ వ్యాప్తి
పూర్ణ చంద్రుని దీప్తి

భుక్తి నీయగలేని శక్తి హీనములంట
ఓ సఖీ మనప్రేమ
వేసటేనట భువికి !

కలలు హుళక్కియట
కళలు వ్యర్థములంట

కళలైన సాంఘిక రాజకీయార్థికా
చలిత భావోద్రిక్త సంకలితమ్మై యుండ

వలెనంట, మనుజప్రగతికి దారంట అవి !
ఓ సఖీ మన ప్రేమ
వేసటేనట భువికి !

భౌతికోన్నతి జేర్చు భౌతికోద్యములుండె
భౌతికోద్యమ మహాప్రజ్ఞార్ధి సమదర్శ
నస్తితికి మానసానంద బుద్ధ్యానంద
స్వస్థతయె మూలమ్ము భావోజ్వలము లవియె

ఓ సఖీ మన ప్రేమ
వేసటేనట భువికి !
ప్రకృతిలో సౌందర్య ప్రత్యక్షదృశ్యాలు
వికసితోత్త మకృషులు సకలకావ్యములు కళలు

పరమసృష్ట్యా విర్భవ రసస్వరూపములు
నరజాతి ప్రగతికవి ఆలంబనోద్దీప
నాధారములు విమల హృదయస్తితికి కార
ణాత్మికము లాప్త శక్తి ప్రపుల్లములు

ఓ సఖీ మన ప్రేమ
అసాధ్య మీ భువికి !

అమలమౌ ఏదృశ్య
మమృతమౌ ఏఘటన

కాల్పనిక చిత్రమై శిల్ప విషయముకాదొ !
అల్పభావము లెట్లు శిల్ప విషయములౌను
పొడితనము ఉన్నతటె
జడత సంపన్నతటె

ఓ సఖీ మన ప్రేమ
ఉత్త మోత్తమ చరిత్రకదవే !

భౌతికాకర్షణాతీత సంకలనమే
భౌమ్యమౌ తుచ్ఛేంద్రి యాకర్షణాతీత

రీతియే, ఘటనయే
ప్రీతియే, ప్రేమయే
సౌందర్య రూపమ్ము సౌందర్య భావమ్ము !

సౌందర్య సంధాన సందర్శనోద్భవము
ఆనందమో దేవి ! ఆనందమే శక్తి
ఆనందమే ప్రగతికై నరులకిడు రక్తి

ఓ సఖీ మన ప్రేమ
ఆసాధ్య మీ భువికి
ఆనంద సౌందర్య
ప్రాణమే మనుజునకు !

✽

సొగసు ... వయసు

✽

ఆసొగసె నీ సోయగమె దేవీ
ఆవయసు నీ హోయలుకావే !
చిట్టిపాపగ నేను చిందులాడిన వయసు
నట్టింట నలుగురూ నన్ను ముద్దిడుసొగసు

ఆసొగసె నీ సోయగమె దేవీ
ఆవయసు నీ హోయలెకావే !

పుట్టుతూ కేరుమని పొంగిపోయిన వయసు
తొట్టిలో శిశువునై తొక్కులాడిన సొగసు

ఆసొగసె ఆహోయలె దేవీ
నీ సోయగము వయసుకావే !

చిలకపందిరి చూస్తు కిలకిలను నావయసు
కులుకుతూ రంగుబొమ్మల నాడు నాసొగసు

ఆసొగసె ఆహోయలెదేవీ
నీ సోయగము వయసుకావే !

"బాపన్న బంగారు బాలన్న" ఆ వయసు
పాటలకు నిదురలో పవ్వళించిన సొగసు

ఆసొగసె ఆహోయలె దేవీ
నీ సోయగము వయసుకావే !

మెళ్లోన పులిగోరు కాళ్ల గజ్జల వయసు
ఒళ్లు బంగరుతొనల ఒరుసుకొను నాసొగసు

ఆసొగసె ఆహోయలె దేవీ
నీ సోయగము వయసుకావే !

తప్పటడుగుల కులికి తలుపుదాటిన వయసు
కప్పురపు వాసనలు గంధమలదిన సొగసు

ఆసొగసె ఆహోయలె దేవీ !
నీ సోయగము వయసుకావే !

ఆనాడె నీకొరకు అన్వేషినగు వయసు
అందాల నెలపాప నడిగివేడిన సొగసు

ఆసొాగసె ఆహోయలె దేవీ !
నీ సోయగము వయసుకావే !

✽

వసంత పూర్ణిమ

✿

ఒక దివ్యకుసుమమ్ము వికసించినది నేడు
నాడూ నేడూ రేపు
నవ పరిమళాలలము.

ఒక దివ్యనాదమ్ము కకుబంతముల చరించు
కోటి వీణల శ్రుతులు
మీటుతూ పాడుతూ.

ఒక దివ్యవర్ణమ్ము సకల శూన్యాలలమె
గంభీర చిత్రాలు
గా రూపమెత్తుతూ.

ఓ ఫాల్గుణ పవిత్ర పరమ శోభాపూర్ణి
మా రాత్రి నాదేవి
మంగళాకృతి వచ్చె !

నాఎదుట నాదేవి నాశశికళే నిల్చె
నాకు నూతన శక్తి
నాకు నూతన రక్తి !

✿

స్మృతులు

ఏనాటివో స్మృతులు
    ఈనాడు నాగతులు
ప్రాణాధికను దేవి
    ప్రత్యక్షమిడు శ్రుతులు.....ఏనా

లిఖియించు చిత్రాన
    లేమ ! వర్ణాలలమి
రేకలను కూర్పుమను
    సొకు లెట్టుల మరతు ....ఏనా

నా పాటలో తాను
    నన తేనియల గొంతు
కలిసి పాడే తీరు
    కలనైన మరతునా ? ......ఏనా

వెన్నెలే తానౌట
    కన్ను మరిగిన తున్ను
వెదకలే నన్న నను
    ఒదిగించు టెరుగనా ......ఏనా

ఇది నా కమవాస్య
    ఈ కటికి చీకట్ల
ఎంత బాధను మనుట
    ఏనాటి స్మృతులనుట......ఏనా.

దేశిక

✿

నాకు శిష్యవు దేవి నీవూ
ప్రణయ మూర్తీ
నాకు దేశికవే ! దేవి నీవూ !

కావ్యములు కవిత్వమన
కవియన రహశ్యాలు
కళని గూఢార్థాలు
తెలుపుమని వేడితివి

నాకు శిష్యవు దేవి నీవూ !
ప్రణయ మూర్తీ !
నాకు దేశికవే ! దేవి నీవూ !

భాషయన భావమన
వాగర్థ పరమగతి

వ్యంగ్యము అలంకారములు
అతి శబల వృత్తులన
రసమన రసానంద
రమ్య జీవిత పరమ

స్థితియన తెలుపుమని
చతురమతి కోరితివి

నాకు శిష్యవు దేవి నీవూ !
ప్రణయ మూర్తీ !
నాకు దేశికవే ! దేవి నీవూ !

విమల గాంధర్వమే
కమనీయములు శ్రుతులు
సప్త స్వరోద్భవము
దీప్త మేళస్తితి

మూర్ఛనలు రాగాలు
ప్రస్థార గమకాలు
విస్థారిత స్థాయి

గాంధర్వ కావ్యాది
సౌందర్య రూపమని

దేవి నీరూపమే

భావాత్మయై వెలిగె

నాకు శిష్యవు దేవి నీవూ !
ప్రణయ మూర్తీ !
నాకు దేశికవే ! దేవి నీవూ !

✽

ఇంతలో...

పదివారములుకాదొ దేవీ !
ఇంతలో
మది విరుగు నిరసనాదేవి !

హృదయాన కుమిలేటి
వ్యధ పోదు మంటలగు

కధగా మిగిలె ప్రేమ
కలలె ఇక నాకేమొ !
పది వారములు.......

ఏనాటికీ కళలు
ఎన్నటికి నీ కలలు

సౌందర్య పూజ, ఆ
నంద హారతి నీకు
పది వారములు......

శిల్ప దేవికి నీకు
చిత్ర విద్యను పూజ

నినుకొలుచు నా బ్రతుకు
నిలుపుదువె ఈ సిలుగు
పది వారములు.....

పాట కై నా హృదిని
పసిడి పల్లకి చేసి
మేళవించెడి తంత్రి
ఫెళ్లుమని తెంపుదువె !
పది వారములు......

ఆశాపరీమళము ఆరిపోవగ నీకు
ఆశాంతముల నలము
ఆశయా శోక సుమ
మే శమించు శోకమున
పదివారములు కాదొ దేవీ !
ఇంతలో
మది విరుగు నిరసనా దేవీ !

గ్రీవ గంగోత్తరి

✽

గ్రీవ గంగోత్త రీ
పావనోద్భూత మం
దాకినీ స్వచ్ఛ మ
స్తోక సౌందర్యమై !
నీ విమల గాంధర్వ
మావిర్భవించినది

ఆనంద పరవశుడ
అల భగీరథుడనై

నిలువెల్ల పొంగితిని దేవీ !
కలుషరహితము జగము దేవీ !

అమృతకలశము గళము
అమల మధుధారగా

నీగాన మాధుర్య
మాగమించెను

ముల్లోకములు గాన
కల్లోలములు నిండ

అమృ తాప్లావితతనూ
కమనీయ మూర్తి నై

నిత్యా విద్యా హృదయ
మృత్యుంజయుడ దేవి !

రాకేందు బింబాస్య
నీకంఠమే జ్యోత్స్న

కాపుంజ మంజుల సు
రూపమై దివ్యమై

భవదీయ సంగీత
పరమ శోభాకాంతి

వేలలే ప్రసరించె
మూలాలు పులకించె

వనధి కలశాంబుధై

జనులెల్ల దేవులై

అబ్ర విగ్రహుడ శ
బ్ద బ్రహ్మనై నేను,

నిను పొదివికొంటినో దేవీ !
నీవు ప్రణవస్వరూపవే దేవీ !

ఖేచరి

ఖేచరీ గంధర్వ బాలా !
భూచరుడ నన్వేషి నేనూ

గరుద్వయమును ముడిచి అస్మత్
గాన పూజాపీఠి వాసించూ !

పల్లవాధరి ! దుధు వసన్త పు
పల్లవిని నీ వాలపింపగ

ఝల్లుమని నా మొరడుహృదయం
వల్లరీ సంపుల్లమయ్యెన్.

గ్రామములు మూర్ఛనలు మొరసెను
గతుల బేధాలెన్నొ మురిసెను

జతుల వర్ణాలన్ని సుడులై
మతుల పరవశతలను ముంచెన్.

స్థాయిత్రయములు అభినయమ్మయె
కాలత్రికములు నృత్త మాడెను

తాలద్వా త్రిశన్మోహిని
తాండవించిందీ !

గళము వీడిన ఖరహరప్రియ
వెలుగు తరగలు విరుచుకొనిపడె

తళుకు తళుకని బ్రతుకు సర్వము
కళానిధి అయ్యన్.

దేవి ! నందనవన సుమాలను
నీవు మలచితి స్వర సుమాలిక

గ్రీవ భూషితదామ పరిమళ
భావపూరిత దేవమూర్తిగ
నేను నిలిచితినే !

జ్యోత్స్నా ద్యుతి

ఇన్నినాళ్లు ఎటదాగెనో
క్రొన్నలరులప్రోవు పాట

విన్నది విన్నట్టు వెదికి
వీనులలసిపోయె దేవి ! ...ఇన్ని నాళ్లు

వన్నెల విలసిల్లు పాట
వెన్నెల సుడితిరుగు పాట

అన్నుకొను పరీమళాలు
అలది కలచు తేనెపాట ... ఇన్ని నాళ్లు

ఇన్ని యుగము లెటనున్నదొ
మిన్నులాను మేటి పాట

తెలి వెలుగులు మలచుపాట
కలరాగము లలముపాట ...ఇన్ని నాళ్లు

కల్పాలే కరగివచ్చె
కడపలన్ని బ్రతుకుచొచ్చె

కల్పతరువు మేన వెలిసె
కలశాంబుధి మదినిపొలసె...ఇన్నినాళ్లు

నేడే నా హృదయవనిని
నిలిచె నిత్య మధుమాసము

నేడే నా జీవితపధి
నిలిచె నిత్య జ్యోత్స్నాద్యుతి.

గానసుందరి

సారెలను సవరించి తంత్రుల
తీరుపుల మీటించి శ్రుతిగా
నేరుపులు పాటించి వయెలిన్
          తాల్చితివి హృదయాన దేవీ !

గారములు శృంగారములు మధు
పూరములు విరితోరములు ఝం
కారములు ఘంకారములు సం
రావములు నయ్యేన్.

రాగములు సంపుల్లమయ్యెను
రాగమొందెను తానవర్ణము
త్యాగ బ్రహ్మమె నాదబ్రహ్మై
తీగెలను స్పందించి వెడలెన్.

జీవమున అట్టడుగు భావము
చేయిపెట్టీ కలచినట్లై
చీకు తలపుల క్షుద్రకాంక్షలు
          చివ్వునా పై కెగసి వచ్చెన్.

గుండెలో ఎట్టిన్ని రంగలు
మండిపోయెను ఆశయాశలు
ఎండిపోయెను మొండినై చెడు
          దుండగుడనై తిన్.

సత్తువంతా పోయి అందపు
మత్తులో పడిపోయి, హృదయము
ఎత్తు పల్లములోన వణికెను,
          చిత్తమున పై రాశ్యమొదవెన్.

తీగెలను స్పందించు విల్లును
రాగ స్వరముల నాడు వేళ్లూ
తూగిపోయే గీతికాతతి
          దోగులాడెను దెసలు దెసలన్నీ !

కోయిలలు పాడేనొ వాగులు
లోయలో నృత్యాలు సలిపెనొ !
వేయి మలయానిలము లొకటై
          వీచెనో శ్రుతులు శ్రుతులన్నీ !

కోటి పూవులు విరిసినట్లై

కోటి చంద్రిక లలమినట్లె
పాటలే ప్రసరించు బ్రతుకున
    బ్రతుకు కదలక శిల్పమై నిలిచెన్.

ఏదియో అమృతాప్లావితమై
ఏదియో ఆనందలీలై
వేదనారహితంపు బ్రతుకై
    రోదసీ పథమెల్ల నిండితి
    హ్లాదమే విశ్వమై నిలిచెన్.

✽

గౌరీశంకర శృంగావిర్భవ

గౌరీశంకర శృంగా విర్భవ
గంగాధర మంజులతర హస్తా

స్పందిత డమరుక దివ్య నినాదము
సుందర వదనా నీ గాంధర్వము.

పం కేరుహ సంభవ సాధ్వీ రుచి
రాంక స్థిత వీణా ఖేలాన
ర్తి తపాణీ కంకణ నిక్వాణ
శ్రుతి సంశ్లేషిత గీతాసామ్యము
అతి మోహనరూపా నీగానము.

యమునాతటి పాటలి తరు నీడను
సుమనోరజ సేవన మృదు వదనుడు
అతసీసుమ సంకాశతనుడు పరి
వృత సీమంతవతీ వ్రజబాలుని
మందార ముకుళ మధురాధర చుం
బ చ్ఛుభ వేణూ వేణుస్వన పరమాద్భుత
మందెను నీ సంగీతము దేవీ !

దీపావళి

దీపావళీ ! విశ్వ
రూపావళీ ! నిత్య
జ్యోత్స్నావళీ ! వృక్ష
శోభావళీ ! దేవి

నా లక్ష్మి నా వాణి,
నా శక్తి నా ప్రతిభయే !
దీపావళీ...!

దీపావళీ ! ప్రణయ
ధూపావళీ ! రాస
గంధావళీ ! తోష
బంధావళీ ! దేవి

నా బ్రతుకు నా చదువు
నా యత్న కార్యార్థమే !
దీపావళీ...!

దీపావళీ ! వర్ణ
లేపావళీ ! దివ్య
చిత్రావళీ ! పరమ
శిల్పావళీ ! దేవి

నా ప్రజ్ఞ నా దీక్ష
విన్యాస వై చిత్రియే !
దీపావళీ...!

దీపావళీ ! రాగ
వ్యాప్తావళీ ! గతుల
తాళావళీ ! కరణ
చారావళీ ! దేవీ

నా నృత్య గీతాభి
నయ నృత్త వృత్తావళీ !
దీపావళీ....!

దీపావళీ ! రథ్య
దేవ్యావళీ ! మధ్య
శృత్యావళీ ! మూర్తి
స్మృత్యావళీ ! దేవి

నా ఆశ ఆశయము
నా అవధి ఆనందమే...!
దీపావళీ...!

అసతోమా సద్గమయ
తమసోమా జ్యోతిర్గమయ
మృత్యోర్మా అమృతంగమయ.

— ✿ —